క్లుప్తంగా

జగన్‌ను కలిసిన యువజన విభాగం నేత



తోటపల్లిగూడూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.వంశీకృష్ణారెడ్డి కలిశారు. ఇంకా ఇనకల్ల వేణుగోపాల్, ఒబ్బా అశోక్‌కుమార్, షేక్ మున్వర్‌బాషా, దినేష్‌రెడ్డి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిశోధన విద్యార్థి షేక్ పర్వేజ్ డాక్టరేట్ అందుకున్నారు. మెరైన్ బయోలజీ విభాగం అధ్యాపకులు సీహెచ్ విజయ పర్యవేక్షణలో పర్వేజ్ అసెస్‌మెంట్ ఆఫ్ రీషెడ్యూల్ బిహేవియర్ ఇన్ ఆక్వాకల్చర్ ప్రొడక్ట్స్ ఆఫ్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. దీంతో వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు బుధవారం అభినందించారు.

కామాక్షితాయికి బంగారు గాజుల బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయికి బుధవారం స్థానికంగా ఉంటున్న కందికట్టు బాలకిరణ్– కవిత దంపతులు 27 గ్రాముల బంగారు గాజులను బహూకరించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో దర్శనం కల్పించి, సత్కరించారు. ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్‌యూలో మైక్రో ఆర్గానిజం డే



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం ఇంటర్నేషనల్ మైక్రో ఆర్గానిజం డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విజయానంద్‌కుమార్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సూక్ష్మజీవుల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మేరీ సందీప, డాక్టర్ కె.ప్రభాకర్, డాక్టర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టదా?



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

కోవూరు: జిల్లాలో అన్నదాతలు అనేక కష్టాలు పడుతున్నారని, కూటమి ప్రభుత్వానికి రైతుల గోడు పట్టదా అని వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రైతుల సమస్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పంటను అమ్మడానికి కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట కోత పూర్తయినా ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులకు ఆందోళన తప్ప వేరే మార్గం లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ పార్వతి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు.

ఏడుగురి మృతి బాధాకరం

కోవూరు: సంగం మండలం పెరమన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందడం బాధాకరమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేసి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంతా మా ఇష్టం

- నేటి నుంచి కసుమూరు దర్గా గంధమహోత్సవాలు
- అద్దె గృహాల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- ఏటా భక్తుల నుంచి అధికంగా అద్దెల వసూళ్లు
- పట్టించుకోని అధికారులు



కసుమూరులోని ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న అద్దె గృహాలు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గా దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందింది. ఇక్కడికొచ్చే భక్తులు నిలువుదోపిడీకి గురవుతున్నారు. అద్దె గృహాల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజుల్లో భక్తులను దోచుకుంటున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వసతుల్లేకపోవడంతో..

కసుమూరులో మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేలాదిమంది వస్తారు. 248 గంధ మహోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఇతర రాష్ట్రాల భక్తులు గురువారం సాయంత్రానికి కసుమూరుకు చేరుకుని కార్యక్రమాలు పూర్తయ్యే వరకూ ఇక్కడే ఉంటారు. అయితే దర్గా ప్రాంగణంలో సరైన వసతుల్లేకపోవడంతో అద్దె గృహాలను ఆశ్రయించాల్సి వస్తోంది. భక్తుల అవసరాలను ఆయా గృహాల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. అద్దె రేట్లను అమాంతంగా పెంచేస్తున్నారు. కసుమూరులో సుమారు 500 అద్దె గృహాలు, వందల సంఖ్యలో నిత్యం బాడుగకు ఇచ్చే గదులున్నాయి. గంధ మహోత్సవాలు, నెల్లూరులో రొట్టెల పండగ జరిగే సమయంలో వారంరోజులు, అమావాస్య రోజున కసుమూరులో అద్దెలు పెంచుతూ భక్తులను అందినకాడికి దోచుకుంటున్నారు. గదులకు సంబంధించి ఒకరోజు బాడుగ రూ.5 వేల నుంచి, రూ.10 వేలు వసూలు చేస్తున్నారు.

చర్యలేవీ?

గంధ మహోత్సవాల సందర్భంలో అద్దె గృహాలు, గదుల అద్దెలు భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారనే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందే. గతేడాది అద్దెలు భారీగా పెంచడంతో యజమానులు, భక్తులకు గొడవ కూడా జరిగింది. భక్తులు బహిరంగంగానే తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలున్నాయి. వసతులు కల్పించకపోవడంతో అద్దె గృహాలను ఆశ్రయించాల్సి వస్తోందని అనేకమంది వాపోతున్నారు. అయితే నిర్వాహకులు రూ.వేలు డిమాండ్ చేస్తుంటంతో తాము ఎక్కడ ఉండాలని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అద్దెల రూపంలో చేస్తున్న దోపిడీని అడ్డుకోవాలని కోరుతున్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పొదలకూరు: 'ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. లేదంటే అన్ని యూనియన్లతో కలిసి ఉద్యమిస్తాం' అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రణభేరి పేరుతో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ప్రవేశపెట్టిన సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ర్యాలీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్థిక, విద్యాపరమైన అంశాలపై ప్రభుత్వం తీరు మార్చుకోవాల్సిందిగా సూచించారు. లేకుంటే ఈనెల 25వ తేదీన గుంటూరులో పెద్దఎత్తున ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావొస్తున్నా ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. వేతన సవరణ గురించి పట్టించుకోలేదని, డీఏ, బకాయిలను అందజేయలేదన్నారు. ప్రపంచ బ్యాంక్ వద్ద రుణాలు పొంది సాల్ట్ ప్రాజెక్టును తీసుకొచ్చి ఉపాధ్యాయులపై రుద్దాలని చూస్తున్నట్టు ధ్వజమెత్తారు. పీ4, కర్మయోగి పథకాలపై ఉపాధ్యాయులను పనిచేయమనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

సమస్యల్ని పరిష్కరించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబర్ 15 నుంచి రణభేరి పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ బుధవారం బుచ్చిరెడ్డిపాళెం చేరుకుందన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సాల్ట్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువైపోతున్నాయని, అలాగే పలు యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో బుచ్చి, దగదర్తి మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత

కొడవలూరు: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా 'స్వస్థ్ నారీ– స్వశక్తి పరివార్'ను అమలు చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత స్పష్టం చేశారు. మండలంలోని గౌతమ్‌నగర్‌లో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించి 40 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై, మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 2వ తేదీ వరకు అన్ని హెల్త్ క్లినిక్‌ల పరిధిలో నిర్వహిస్తామన్నారు. ప్రత్యేకంగా మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్‌తో పాటు బీపీ, షుగర్, గర్భకోశ సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఎస్.సునీల్‌కుమార్, నవీన్‌కుమార్, సీహెచ్‌ఓ సోమశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం మహ్మదాపురం పీహెచ్‌సీలో మహిళల కోసం ప్రత్యేక వైద్యశిబిరాన్ని వైద్యాధికారి వి.నరసింహారావు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ పౌష్టికాహారం కోసం స్టాల్స్‌ను పెట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు కె.శ్రీనివాసులు, జి.వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ, డి.పద్మజ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కొడవలూరు : మాట్లాడుతున్న డాక్టర్ బ్రిజిత



పొదలకూరు : పౌష్టికాహార స్టాల్

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

పొదలకూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని డేగపూడి గ్రామానికి జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి విచ్చేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేల సారవంతానికి రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలన్నారు. జీలుగలు, పిల్లిపెసర, జనుము పచ్చిరొట్ట ఎరువుగా వాడుకోవచ్చని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల నేల సారంతంగా మారి పంటలు బాగా పండతాయన్నారు. వరి పంట కోతలు చేపట్టే రైతులు టార్పాలిన్ పట్టలను అందుబాటులో ఉంచుకోవాలని, వాతావరణానికి అనుకూలంగా పంటల కోతలు చేపట్టాల్సిందిగా సూచించారు. సమావేశంలో ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ప్రతాప్, ఏఈఓ ఏడుకొండలు నాయక్, వీఏఏ కౌసల్య, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల పరిశీలన

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని ప్రభుత్వ లేఅవుట్‌లో నిర్మించిన గృహాలను బుధవారం స్టేట్ విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఇళ్ల నాణ్యతపై కూటమి ప్రభుత్వం తనిఖీలు చేసి నివేదికలను సమర్పించాల్సిందిగా విజిలెన్స్ శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వాటిని పరిశీలించారు. మొత్తం 1,400 ప్లాట్లు ఉండగా 400 ఇళ్లను కాంట్రాక్టర్లు నిర్మించారు. విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్‌రాజు వాటి నాణ్యతా ప్రమాణాలను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ మోహన్‌రావు, డీఈ జహీర్, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ఎదురుచూపులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో ఆధార్‌లేని 11 మంది గిరిజనులు ఉదయం నుంచి ఆధార్ నమోదు కోసం ఎదురు చూశారు. అయితే సాయంత్రమైనా అధికారులు రాకపోవడంతో వారు వెనుదిరిగారు. మండలంలో ఆధార్ లేనివారికి ఈనెల 15నుంచి 19వ తేదీ వరకు ఆధార్ నమోదు చేయించాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. ఆమె ఆదేశాలను సైతం అధికారులు లెక్కచేయకపోవడం గమనార్హం.

స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ జట్లను బుధవారం ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాలబాలికల అండర్–14, అండర్–17 జట్లను ఎంపిక చేశారు. ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య పర్యవేక్షించారు. హెచ్‌ఎం ఎం.మోహన రామలింగయ్య, పీఈటీలు బి.ప్రవీణ్, ఐ.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు



పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి



ప్రత్యేక పుష్పాలంకరణలో వినాయకుడు

మనుబోలు: ఏకాదశిని పురస్కరించుకుని మనుబోలు పరిధిలోని వెంకయ్యస్వామి, వరసిద్ధి వినాయక స్వామి ఆలయాల్లో బుధవారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వెంకయ్యస్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమానికి మక్కం రత్నంశెట్టి ఉభయకర్తగా వ్యవహరించారు.

మంగలికట్టలో వసతుల కల్పనకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్, చైర్‌పర్సన్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని మంగలికట్ట కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'మాపై ఎందుకీ కక్ష' కథనానికి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో బుధవారం మంగలికట్ట కాలనీలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. డ్రెయినేజీ, తాగునీరు, వీధి దీపాలు లేవని వారు వివరించారు. సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల రోడ్లలో ప్రస్తుతానికి మట్టిని తోలిస్తామన్నారు. తర్వాత రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

కష్టాలు తెలుసుకుంటూ.. భరోసా ఇస్తూ..



కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: గత 31న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ప్రసన్న ఇంటి వద్ద పోలీసుల లాఠీచార్జిలో గాయపడిన పార్టీ కార్యకర్తలు, నాయకులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. వారి కష్టాలు తెలుసుకుంటూ.. ధైర్యంగా ఉండాలని, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. కోవూరు మండలంలోని స్టౌ బీడీ కాలనీలో పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కవరగిరి ప్రసాద్‌ను పరామర్శించారు. అదేవిధంగా మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన యర్రంరెడ్డి ఆదినారాయణరెడ్డిని, కోవూరులో నివాసం ఉంటున్న విడవలూరు మండలం చౌకిచర్ల ఎంపీటీసీ సభ్యుడు అనపల్లి ఉదయభాస్కర్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, కోవూరు జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, విడవలూరు మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, జిల్లా యాక్టివిటీ విభాగం కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అహ్మద్, జిల్లా మేధావుల ఫోరమ్ విభాగం కార్యదర్శి గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు విజయసేనారెడ్డి, సురేంద్ర, సందీప్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

కాగా కోవూరులో పార్టీ కార్యకర్తలతో ప్రసన్న సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కష్టపడిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు.



పాటూరులో యర్రంరెడ్డి ఆదినారాయణరెడ్డితో మాట్లాడుతూ..



అనపల్లి ఉదయభాస్కర్‌ను పరామర్శిస్తూ..



జెడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రసన్న

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లికార్జున తెలిపారు. అండర్–14 బాక్సింగ్ విభాగంలో కృష్ణ, హేమంత్, అండర్–17 విభాగంలో లక్ష్మీనారాయణ, అఖిల్, అన్వర్‌బాషా, అండర్–14 సెపక్ తక్రా బాలబాలికల క్రీడలకు లేబూరు వెంకట కావ్య, పల్లా యోగేష్, దుర్గాప్రసాద్, లోకేష్, అండర్–17 విభాగంలో పూనమల్లి పావని, ఇందు, బాషా, అండర్–19 విభాగంలో స్నేహ, లాస్య, అండర్–14 కరాటేకు అంజనీకుమార్ ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ క్రమంలో వారిని బుధవారం అభినందించారు.

తైక్వాండో పోటీలకు జీవీకే విద్యార్థులు

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కొత్తూరులోని జీవీకే చిన్మయ విద్యాలయ విద్యార్థులు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ హరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14 విభాగంలో పాఠశాల విద్యార్థులు జి.లక్ష్మీదీపిక, ఎస్.హర్షవర్ధన్‌లు జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రమోహన్‌ను డైరెక్టర్ హరిత, ప్రిన్సిపల్ బసిరెడ్డి అభినందించారు.



పీడీతో లక్ష్మీదీపిక

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రక్తదాన శిబిరం

వెంకటాచలం: దేశ ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బుధవారం రక్తదాన శిబిరం జరిగింది. 80 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జనార్దనరాజు, నాయకులు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

➡ మానసిక వికలాంగుల కేంద్రంలో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కుంచి శ్రీనివాసులు యాదవ్, హసనాపురం శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని కొట్టాలు గ్రామంలోని శ్రీకృష్ణ వృద్ధుల ఆశ్రమంలో బీజేపీ నాయకులు బుధవారం దుప్పట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సిద్దన మనోహర్‌రెడ్డి, పి.రాఘవరెడ్డి, బాలరాఘవరెడ్డి, గంజం పెంచలప్రసాద్ పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని యల్లాయపాళెం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, తేళ్లమిట్ట గిరిజన కాలనీ ప్రజలకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దద్దోలు మాల్యాద్రి, నాయకులు పడాల మురళీకృష్ణ, అన్నం భవాని, చెరుకూరు వెంకయ్య, వెంకటేశ్వర్లు, శివకుమార్ పాల్గొన్నారు.



వెంకటాచలం : రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జనార్దన్‌రాజు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



కొడవలూరు: గిరిజనులకు పండ్ల పంపిణీ